నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 | హైదరాబాద్, శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 | SANGAREDDY

మెదక్ రైల్వేస్టేషన్‌కు మహర్దశ

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఎంపిక

- ఆధునికీకరణ పనుల కోసం రూ.15.29 కోట్లు కేటాయింపు
- ఈ నెల 26న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధానిమోదీ

మెదక్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద మెదక్ రైల్వేస్టేషన్ ఎంపికైంది. దేశంలోని 500 రైల్వేస్టేషన్ల ఆధునికీకరణలో భాగంగా మెదక్ రైల్వేస్టేషన్‌కు కూడా స్థానం దక్కడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం కేంద్రం రూ. 15.29 కోట్లు కేటాయించింది. రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు ప్రారంభించిన అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం, స్టేషన్‌లో స్వచ్ఛత పాటించడం, ప్రయాణికుల వెయిటింగ్ హాల్స్, టాయిలెట్స్, ఉచిత వైఫై సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. స్టేషన్ ముందు, వెనుక భాగాల్లో మొక్కల పెంపకం, చిన్నపాటి పార్కులు, స్టేషన్‌లో బిజినెస్ మీటింగ్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. అవసరమైన నిర్మాణాలు చేపట్టడం, పట్టణానికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలను అనుసంధానం చేయడం, దివ్యాంగుల కోసం ప్రత్యేక వసతులు, సుస్థిర పర్యావరణ అనుకూల పరిష్కారాలు, పట్టాలకు ఇరువైపులా కాంక్రిట్ బాటలు, రూఫ్ ప్లాజాలు, ఇతర సౌకర్యాలను కల్పిస్తారు. ఈ నెల 26న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా 40 స్టేషన్లను ఒకేసారి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించనున్నారు.

గీతాభూపాల్‌రెడ్డి కళాశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, పక్కన ప్రొటెం మాజీ వైర్మన్ భూపాల్‌రెడ్డి

నాణ్యమైన విద్యకు కేరాఫ్ గీతాభూపాల్ రెడ్డి కళాశాల

- నాడు 30మంది.. నేడు 1200 మంది విద్యార్థులు
- జడ్పీచైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి
- అట్టహాసంగా గీతాభూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంజూశ్రీజైపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 22: సంగారెడ్డి జిల్లాలో నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా గీతాభూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల నిలుస్తుందని జడ్పీచైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్సీపురం డివిజన్ మయూరినగర్‌లో ఉన్న గీతాభూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల 16వ వార్షికోత్సవం అట్టహాసంగా జరిగింది. వేడుకలకు జడ్పీచైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, ప్రొటెం మాజీచైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30మందితో మొదలైన జూనియర్ కళాశాల నేడు 1200మందికి చేరుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. భూపాలన్న జూనియర్ కళాశాలను సొంత ఖర్చుతో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు అండగా నిలవడం ఆదర్శనీయమన్నారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందజేస్తామన్నారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతోనే ప్రతిఒక్కరూ జీవితంలో అభివృద్ధిని సాధిస్తారని, అలాంటిది పేద విద్యార్థులెవరూ చదువుకు దూరం కావద్దనే ఉద్దేశంతో ఎన్నో వ్యయప్రాయాసాలకోర్చి కళాశాలను అభివృద్ధి చేశామన్నారు. అనంతరం బైపీసీలో 981మార్కులు సాధించిన శ్రావ్యలతను ప్రత్యేకంగా అభినందిస్తూ నీట్‌లో ర్యాంకు సాధిస్తే ఎంబీబీఎస్‌కి అవసరమయ్యే ఖర్చును భరిస్తానని చెప్పారు. అనంతరం క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్పానగేశ్, సింధూఆదర్శ్‌రెడ్డి, మెట్టుకుమార్‌యాదవ్, ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి, ఎస్సై శశికాంత్‌రెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, గూడెం మధుసూదన్‌రెడ్డి, సోమిరెడ్డి, కుమార్‌గౌడ్, బాల్‌రెడ్డి, యాదగిరి యాదవ్, దేవేందర్‌యాదవ్, అంజయ్య, బాబ్జీ, ఐలేశ్, జగన్నాథ్‌రెడ్డి, పరమేశ్‌యాదవ్, విజయ్‌కుమార్, జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో ఫస్ట్ రావాలి.. సిద్దిపేటకు పేరు తేవాలి

- పదోతరగతి మీ పిల్లల భవిష్యత్‌కు పునాది
- వందశాతం ఉత్తీర్ణత సాధించి సిద్దిపేట గౌరవాన్ని నిలబెట్టుకుందాం..
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాజీమంత్రి హరీశ్‌రావు టెలీకాన్ఫరెన్స్

టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22: మార్చి 18 నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షలకు మీ బిడ్డను శ్రద్ధగా చదివించాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట నియోజకవర్గ పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో గురువారం హరీశ్‌రావు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుంచి పరీక్షలు ఉన్నందున మీ పిల్లలను మంచిగా చదివించాలని..ఫంక్షన్లకు, టీవీలకు దూరంగా ఉంచాలని ఉత్తరం రాసినట్లు గుర్తు చేశారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయడంతోపాటు సొంత ఖర్చులతో స్నాక్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మీ పిల్లలను నా బిడ్డలుగా భావిస్తానని, వారు మంచి మార్కులు సాధించాలన్నదే తన తాపత్రేయమన్నారు. కొంతమంది పిల్లలు ప్రత్యేక తరగతులకు హాజరుకావడం లేదని.. పరీక్షల య్యే వరకు ప్రతిరోజూ పాఠశాలకు పంపించాలన్నారు. కొన్ని సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇప్పిస్తామని తెలిపారు. పదోతరగతి భవిష్యత్‌కు పునాది అని.. ఇందులో ఒక మెట్టు ఎక్కితే భవిష్యత్‌లో పైచదువులకు, ఉద్యోగానికి అవకాశం ఉంటుందన్నారు. ఇంటి వద్ద చదివించే బాధ్యత మీది.. అందుకు నా పూర్తి సహకారం ఉంటుందన్నారు.

మీ రుణం తీర్చుకోలేనిది సార్..

మీ పిల్లలను చదివిస్తున్నారా...టీవీలు బంద్ చేస్తున్నారా.. అని మాజీమంత్రి హరీశ్‌రావు విద్యార్థుల తల్లిదండ్రులను అడగ్గా.. కొంతమంది తల్లిదండ్రులు మాట్లాడుతూ..మీరు పంపిన ఉత్తరం వచ్చింది..మా బిడ్డకు చదివి లెటర్ రాయమని చెప్పామని సమాధానం ఇచ్చారు. చిన్నకోడూర్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన స్వామి మాట్లాడుతూ..సార్ మా బిడ్డల గురించి ఇంత శ్రద్ధ తీసుకుంటున్న మీ రుణం తీర్చుకోలేనిది. అందుకే మీరు ఎల్లప్పుడూ మా గుండెల్లో ఉంటారు సార్ అని ఉద్వేగంగా చెప్పారు. దీనికి మాజీమంత్రి హరీశ్‌రావు బదులిస్తూ సిద్దిపేట నా కుటుంబం, నా బిడ్డలుగా భావిస్తా. ఇది నా బాధ్యత అన్నారు.

బేటీ బచావో- బేటీ పడావో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

బాల్య వివాహాలను అరికట్టాలి

- ఆడపిల్లలు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించాలి
- ఆడపిల్లలపై వివక్షకు 1098 టోల్ ఫ్రీనంబర్‌లో ఫిర్యాదు చేయాలి
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా
- బేటీ బచావో - బేటీ పడావోపై సమీక్షా సమావేశం

మెదక్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఆడపిల్లలపై వివక్షను రూపుమాపాలని, బాల్యవివాహాలను అరికట్టాలని, అందుకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించడం, చదివించడం వల్ల సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. సమాజంలో వస్తున్న మార్పుల కారణంగా ఆడపిల్లలు వివక్షకు గురవుతున్నారని, ఈ జాఢ్యాన్ని రూపుమాపాలంటే ముందు కుటుంబ వ్యవస్థలో మార్పురావాలన్నారు. అమ్మాయిలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని, బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. పాఠశాలలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన, ప్రతి అంశంపై చర్చించగలిగే ధైర్యం ఉండాలన్నారు. అమ్మాయిలు తమ స్నేహితులు లేదా తోటి వారు సమస్యల్లో ఉన్నప్పుడు ధైర్యంగా ఎదుర్కొనేందుకు తోడ్పాటు అందించాలని సూచించారు. అధికారులు, ఎన్జీవోలు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి సమస్యలు పరిష్కరించాలని, అమ్మాయిలను గర్భస్థ శిశువు నుంచి కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించి, బేటీ బచావో– బేటీ పడావో పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఈవో రాధాకిషన్, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, మెప్మా పీడీ ఇందిరా, సూపర్‌వైజర్లు, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్లు, వివిధ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్‌లో సమ్మక్క, సారలమ్మలకు నిలువెత్తు బంగారం, ప్రత్యేక పూజలు

హుస్నాబాద్‌లో సమ్మక్క జాతరలో ప్రదక్షిణ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఫిబ్రవరి 22: వన దేవతల కటాక్షంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లో సమక్క,సారలమ్మలకు నిలువెత్తు బంగారం ఇచ్చిన అనంతరం ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న జాతరకు బంగారం బుట్ట (బెల్లం బుట్ట) ఎత్తుకొని అమ్మవారికి సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి, హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతరలను సందర్శించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీసర్పంచ్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు వల్లపు రాజు, పున్న లావణ్యసది, చిత్తారి పద్మ, సరోజన, ఎండీ హసన్, మైదంశెట్టి వీరన్న, మడప జయపాల్‌రెడ్డి, ఎగ్గిడి అయిలయ్య, బుర్ర ప్రభాకర్, ముత్యాల సంజీవరెడ్డి, కిష్టస్వామి, మంద పవన్, కొయ్యడ కొమురయ్య పాల్గొన్నారు.

సన్‌ఫ్లవర్ రైతులకు శుభవార్త

- ఈనెల 26 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ఫలించిన మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22: పొద్దుతిరుగుడు సాగుచేసిన రైతులకు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభవార్త చెప్పారు. పొద్దుతిరుగుడు రైతులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులు బయట మార్కెట్‌లో పొద్దుతిరుగుడు పంట అమ్ముకొని నష్టపోతున్నారని, గతేడాది కూడా సిద్దిపేటలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈసారి కూడా కొనుగోలు ఏర్పాటు చేయాలని గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మాట్లాడానన్నారు. స్పందించిన మంత్రి ఈనెల 26వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పామన్నారు. సిద్దిపేట, చిన్నకోడూరు మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకానున్నట్లు చెప్పారు. రూ.6,760 మద్దతు ధర చెల్లిస్తారని, రైతులు ప్రైవేటు మార్కెట్‌లో విక్రయించి నష్టపోవద్దని సూచించారు.

మార్కెట్ పూర్తయ్యేదెప్పుడు?

మెదక్‌లో పునాదులకే పరిమితమైన సమీకృత మార్కెట్

- జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల్లో నిర్మాణం
- బిల్లుల పేరుతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్ ..?
- రూ. 8 కోట్లతో అదనపు ఎస్టిమేషన్


మెదక్ పట్టణంలో పునాదుల స్థాయిలోనే నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

మెదక్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా కేంద్రంలో సమీకృత మార్కెట్ నిర్మాణం పునాదులకే పరిమితమయింది. ప్రజలకు కూరగాయలు, మాంసాహారం ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చింది. అందులో భాగంగా పట్టణంలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయం పక్కన రెండు ఎకరాల స్థలంలో అత్యాధునిక వసతులతో మార్కెట్ నిర్మాణానికి నిర్ణయించింది. గతనడాది ... నెలలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 6 కోట్లు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని భావించినప్పటికీ సదరు కాంట్రాక్టర్ నిధులు, బిల్లుల సమస్యలంటూ పనులు నిలిపివేశాడు. దీంతో సరైన స్థలం లేక రైతులు, వ్యాపారులు రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుండగా, దుకాణాల యజమానులు రైతులను ఇబ్బంది పెడుతున్నారు. మున్సిపాలిటీ నుంచి కనీస సౌకర్యాలు కల్పించకపోగా తైబజార్ పేరుతో డబ్బు వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాజాగా రూ.8 కోట్లతో అదనపు ఎస్టిమేషన్

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రూ.8 కోట్లతో అదనపు ఎస్టిమేషన్ వేసినట్టు అధికారులు తెలిపారు. కానీ ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధులు మంజూరైతే మార్కెట్ పనులు కొనసాగే అవకాశం ఉంది. పునాదులకే పరిమితమైన మార్కెట్ పనులను చూసి ప్రజలు నిరాశకు గురవుతున్నారు. తిరిగి పనులు ఎప్పుడు మొదలుపెట్టి ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని త్వరితగతిన మార్కెట్‌ను నిర్మించి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు

- ప్రతి అధికారి నిజాయితీగా విధులు నిర్వర్తించాలి
- మాదకద్రవ్యాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలి
- సిద్దిపేట సీపీ అనురాధ

సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22: విధి నిర్వహణలో అలసత్వం వహించద్దని, ప్రతి అధికారి నిజాయితీగా పనిచేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. గురువారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో గజ్వేల్ డివిజన్ పోలీస్ అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సైబర్ నేరాలు జరగకుండా ప్రజలకు, యువకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మార్చి 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు డిస్పోజలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన కేసులను త్వరగా పూర్తి చేసి, చార్జ్‌షీట్ వేయాలని సూచించారు. పీడీఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి, నేరాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ బాలాజీ, సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ

ఇతర ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలకు విద్యుత్ సరఫరా

- సిద్దిపేట 220/132 కేవీలో రోజంతా మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవతో విద్యుత్ సరఫరా
- బుధవారం రాత్రి 11:30 వరకు అక్కడే ఉండి అధికారులకు దిశానిర్దేశం చేసిన హరీశ్‌రావు
- విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లా కేంద్రం ముస్తాబాద్ చౌరస్తాలోని 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పేలిన 100 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గురువారం రాత్రి వరకు సైతం చిన్న మంటలతోపాటు పొగ వస్తూనే ఉన్నది. ఫైరింజన్‌తో రోజంతా సిబ్బంది ఆర్పే పనిలోనే నిమగ్నమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బుధవారం రాత్రి 11:30 వరకు అక్కడే ఉండి అధికారులతో మాట్లాడి, సమస్యను పరిష్కరించి మంటలను పూర్తిగా ఆర్పిన తర్వాత విద్యుత్‌ను తాత్కాలికంగా పాలమాకుల, హబ్సిపూర్, చంద్లాపూర్, దుద్దెడ తదితర సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్‌ను పునరుద్ధరింపజేశారు. దీంతో సిద్దిపేట పట్టణం, గ్రామాలకు, దుబ్బాక నియోజకవర్గంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా జరిగింది. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గురువారం ఉదయం 220/132 కేవీ సబ్‌స్టేషన్‌లోని మిగితా160 ఎంవీఏ, 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి యథావిధిగా అన్ని ప్రాంతాలకూ పూర్తిస్థాయిలలో విద్యుత్‌ను ట్రాన్స్‌కో అధికారులు పునరుద్ధరించారు. సిద్దిపేటకు కరీంనగర్, గజ్వేల్, దర్శన్ నుంచి విద్యుత్ సప్లయ్ జరుగుతుంది. సిద్దిపేట ముస్తాబాద్ చౌరస్తాలో 1997వ సంవత్సరంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసినప్పుడు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఇక్కడ మూడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. రెండు 100ఎంవీఏ, ఒకటి 160ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ప్రస్తుతం100ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లకు బదులుగా అన్ని 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు వస్తున్నాయని అధికారులు తెలిపారు. పేలిన 100 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను స్క్రాప్‌కు పంపించామని, దానిస్థానంలో కొత్తది 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తామని అధికారులు తెలిపారు. పేలిన ట్రాన్స్‌ఫార్మర్ రికార్డు ప్రకారం దాని కాస్ట్ రూ.75 లక్షలు ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్ ఇతర సామగ్రి అన్నీ కలుపుకొని సుమారుగా రూ.3 నుంచి 4 కోట్ల వరకు నష్టం ఉంటుందని ప్రాథమిక సమాచారం.

విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం

సిద్దిపేటలో పేలిపోయిన విద్యుత్ కేంద్రాన్ని గురువారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ కలెక్టర్ పాటిల్, విద్యుత్, అగ్నిమాపక అధికారులతో కలిసి పరిశీలించారు. గృహ వాణిజ్య, వ్యవసాయ అవసరాలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా విద్యుత్ సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ దురదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం జరిగిందన్నారు. గృహ వినియోగదారులు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. గురువారం ఉదయం నుంచి వ్యవసాయ బావులకు కరెంట్ సరఫరా చేస్తున్నామన్నారు. విద్యుత్ ప్రమాదానికి గల కారణాలను, నష్టాన్ని అంచనా వేస్తున్నామని చెప్పారు.

మాజీమంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతోనే..

బుధవారం రోజంతా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమాలు పూర్తికాగానే హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడకి చేరుకున్నారో లేదో..ఇంతలోనే సిద్దిపేట 220/132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి మం టలు పెద్దఎత్తున ఎగిసిపడుతున్నాయనే సమాచారం అందకున్నారు. హుటాహుటిన హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు తిరుగు ప్రయాణమయ్యారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సమాచారం ఇచ్చి ఆయనను తీసుకొని వచ్చారు. హైదరాబాద్ నుంచి కారులో వస్తూనే పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫోన్‌లో సమీక్షిస్తూ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి బట్టి విక్రమార్క, విద్యుత్ శాఖ కార్యదర్శి రజ్వీ, ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డిలతో మాట్లాడి సమస్యను వివరించారు. సిద్దిపేట విద్యుత్ కేంద్రానికి చేరుకొని ఫైర్‌ఇంజిన్లతో మంటలు ఆర్పించారు. మున్సిపాలిటీలోని వాటర్ ట్యాంకర్లు తెప్పించారు. అధికారులకు గైడ్ చేశారు. రాత్రి 6.58 గంటలకు ప్రమాదం జరగ్గా రాత్రి 10 గంటల సమయంలో మంటలు ఆరిపోయాయి. దీంతో అందరిలోనూ టెన్షన్ తగ్గింది. రాత్రి 10.45 గంటలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. విద్యుత్‌ను పునరుద్ధరించినా మళ్లీ ఎలాంటి ఇబ్బంది రాకుండా నాలుగు ఫైర్ ఇంజన్లు అక్కడే పెట్టించారు. రాత్రి 11.30 గంటల తర్వాత అక్కడి నుంచి హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి వెళ్లిపోయారు. ప్రజల కోసం హుటాహుటిన సిద్దిపేటకు చేరుకొని సమస్యను పరిష్కరించిన నాయకుడు హరీశ్‌రావు. మా నాయకుడు అంటే ఇలా ఉం టారు... అని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఆయన చొరవ తీసుకోకుంటే రెండు రోజులైనా కరెంట్ వచ్చేది కాదేమో అని ప్రజలు ముచ్చటించుకోవడం కొసమెరుపు.

సబ్‌స్టేషన్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్, ఫైర్ ఇంజిన్‌తో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సిద్దిపేట విద్యుత్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్